

శరణు.. శరణు.. చెంగన్నా!



ది గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌లో ... ది గ్రాండ్ ఓల్డ్ పొలిటీషియన్‌గా పేరున్న మాజీ మంత్రి చెంగారెడ్డిని నగరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా తరచూ ఏదో ఒక సందర్భం పేరుతో కలుస్తుండడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. జనవరి 13న జన్మదినం సందర్భంగా నగరిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో చెంగారెడ్డిని కలిసి రోజా శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఐదేళ్లలో అంతకు మునుపు ఏ పుట్టినరోజునా ఆమె ఇలా కలవలేదు. రెండు రోజుల కిందట మళ్లీ ఆయనను కలిసి నగరిలోని దేశమ్మ ఆలయ కుంభాభిషేకానికి ఆహ్వానించారు. 2014 సార్వత్రిక ఎన్నికల తరువాత ఒకరకంగా అస్త్రసన్యాసం చేసిన చెంగారెడ్డి మీద హఠాత్తుగా ఎన్నికల ఏడాది మాత్రమే ఈ గౌరవాభిమానాలు ప్రకటించడం వెనుక ఏముందనే చర్చ నడుస్తోంది. నియోజకవర్గవ్యాప్తంగా ఎలా ఉన్నప్పటికీ ప్రధానంగా సొంత మండలం నింద్రలో చెంగారెడ్డిని అభిమానించే నాయకులు, కార్యకర్తలు ఇప్పటికీ ఉన్నారు. అలాగే నింద్ర మండలంపై చెంగారెడ్డి అన్న కుమారుడు శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న రెడ్డివారి చక్రపాణిరెడ్డికి బలమైన పట్టుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం 7 ఎంపీటీసీలకు గాను ఐదింట చక్రపాణిరెడ్డి మద్దతుదారులు వైసీపీ తరఫున పోటీ చేసి గెలిచారు. నింద్ర జడ్పీటీసీ మల్లీశ్వరి కూడా చక్రపాణిరెడ్డి వర్గమే. అయితే చక్రపాణిరెడ్డి వైసీపీలోనే ఉన్నా రోజాకు బద్ధ వ్యతిరేకిగా ఉన్నారు. నింద్ర ఎంపీపీ కాకుండా తన తమ్ముడు భాస్కర రెడ్డిని రోజా అడ్డుకున్న తీరు ఆయనలో తీవ్ర వ్యతిరేకతను పెంచింది. అన్న చెంగారెడ్డితో అంటీముట్టనట్టుగా వుండిన చక్రపాణిరెడ్డి మంత్రి రోజాతో విభేదాల తర్వాత ఆయనతో సంబంధాలను పునరుద్ధరించుకున్నారు. ఎంపీపీ ఎన్నిక తర్వాత రెడ్డివారి కుటుంబం రోజాకు వ్యతిరేకంగా మారింది. ఈ నేపథ్యంలోనే నింద్ర మండలంలో చక్రపాణిరెడ్డి పట్టును సడలించాలంటే చెంగారెడ్డిని ప్రసన్నం చేసుకోవడం తప్ప మరో మార్గం లేదనే అభిప్రాయానికి వచ్చిన మంత్రి రోజా తరచూ ఆయనను కలిసి ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

- పుత్తూరు అర్బన్

రక్తపుబొట్లు రాజకీయం




తిరుపతిలో రక్తపుబొట్లు రాజకీయం నడుస్తోంది. 'నా చివరి రక్తపు బొట్టు వరకు మీకోసమే పనిచేస్తా' అంటూ నేతలు వీరోచిత వాగ్దానాలు చేస్తున్నారు. అది కార్మికుల సమావేశమైనా, క్యాడర్‌తో మీటింగ్ అయినా నెత్తుటి బొట్టు మాట మార్చకుండా ఉపన్యాసం ముగియడం లేదు.వైసీపీ నాయకులైతే రోజుకు ఐదారు ఆత్మీయ సమ్మేళనాల్లో ఉపన్యాసాలు దంచుతున్నారు. టీడీపీ అభ్యర్థి ఎవరో తేలకపోవడంతో వారు మాత్రం ఈ జోరులో వెనుకబడిపోయారు. వైసీపీ నేతలు మాత్రం సన్నిహితులు, మద్దతుదారులు, క్యాడర్ సహాయంతో కుల సంఘాలు, వృత్తి సమూహాలను ఏకంచేసి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. ప్రత్యేక 'విందు'ను అందజేస్తున్నారు. పదిమంది పనిచేసే వ్యాపార సంస్థలనూ వదిలిపెట్టడంలేదు. అసంతృప్తిగా ఉన్న కార్యకర్తలను గుర్తించి విందుకు పిలుస్తున్నారు. గొంతెమ్మ కోర్కెలు కోరేవారిని రెండు నెలలు ఓపిక పట్టమని భుజం తడుతున్నారు. దోబీఘాట్‌లోని శ్రీనివాస రజక యువజన సంఘం ఆత్మీయ సమావేశం, ఎమ్మార్‌పల్లిలో ఎస్వీ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల యూనియన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం, ఎన్‌ఎస్‌ఎ బెస్ట్ వలంటీర్లతో ఆత్మీయ సమ్మేళనం, స్థానిక డీపీఆర్ కల్యాణ మండపంలో మహిళలతో ఆత్మీయ సమావేశం, ఇంకా పురోహితులు, చెవులు కుట్టు, వాయిద్య కళాకారుల సంఘాలతో సమావేశం, బలిజ సంఘంతో ఆత్మీయ విందు...ఇలా ఉదయం నుంచి రాత్రి 8 గంటల దాకా ఆత్మీయంగా సమావేశాలు జరిగాయి. ప్రతి సమావేశంలోనూ చివరి రక్తపుబొట్టు మాట మాత్రం మరవడం లేదు.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి


మరో వికెట్ అవుట్

- డూప్లికేట్ ఓటరు కార్డుల వ్యవహారంలో తిరుపతి మున్సిపల్ పూర్వ డీసీపై వేటు
- ఈసీ నియమించకనే ఈఆర్వోగా వ్యవహరించిన చంద్రమౌళీశ్వరరెడ్డి
- ఈసీ విచారణలో వెలుగు చూసిన వైనం

తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో డూప్లికేట్ ఓటరు కార్డులు సృష్టించిన వ్యవహారంలో నాలుగో వికెట్ పడింది. తిరుపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ ఇటీవలే బదిలీపై వెళ్ళిన చంద్రమౌళీశ్వరరెడ్డి మీద డూప్లికేట్ ఓటరు కార్డుల వ్యవహారంలో ఎన్నికల కమిషన్ సస్పెన్షన్ వేటు వేసింది. 2021 మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా చంద్రమౌళీశ్వరరెడ్డి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను ఉల్లంఘించి అడ్డగోలుగా వ్యవహరించారని తేలడంతో ఎన్నికల కమిషన్ ఈ చర్యలు తీసుకుంది. కాగా తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై విచారణలో భాగంగా అప్పటి మున్సిపల్ కమిషనర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీశాతో మొదలైన సస్పెన్షన్ల పరంపరలో ఈయన నాలుగో వ్యక్తి.



తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఉప ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న అక్రమాలు ఒకటొకటే ఇపుడు వెలుగు చూస్తున్నాయి. ఎన్నికల కమిషన్ విచారణలో విస్తుపోయే వాస్తవాలు తెలుస్తున్నాయి. అందులో కీలకమైంది ఎన్నికల కమిషన్ నియమించకుండానే చంద్రమౌళీశ్వరరెడ్డి ఈఆర్వోగా వ్యవహరించడం. లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ నిజానికి ఆయనను తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి ఏఆర్వోగా, తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఆర్వోగా నియమించింది. ఆ మేరకు 2021 మార్చి 17న గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ అయింది. అంతే తప్ప తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) ఆయన్ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ నోటిఫై చేయలేదు. అయినా కూడా ఆయన తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా కూడా పనిచేశారు. ఆ హోదాలో ఆయన పేరు, ఫోన్ నంబరు ఈఆర్వో ప్రొఫైల్‌లో నమోదు కావడాన్ని బట్టి ఓటరు కార్డుల డౌన్‌లోడ్‌కు సంబంధించిన అక్రమాలకు ఆయన్ను బాధ్యుడిగా ఎన్నికల కమిషన్ పరిగణిస్తోంది. ఎలాంటి క్లైమ్ ఫామ్‌లూ అందకుండానే సుమారు 35 వేల ఓటరు కార్డులను డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో ఇతడి పాత్రను పోలీసు దర్యాప్తులో నిర్ధారించాల్సి వుందని ఎన్నికల కమిషన్ ఇతని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల అక్రమాలకు అప్పటి తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్ ఆర్వోగా వ్యవహరించిన నాటి మున్సిపల్ కమిషనర్, ఇటీవల వరకూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన గిరీశా తొలుత చర్యలకు గురయ్యారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఈసీ ఆయనపై గత నెలలో సస్పెన్షన్ వేటు వేసింది. ఆపై వారం రోజులకే నాటి తిరుపతి అర్బన్ తహసిల్దారు, ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్లను సైతం సస్పెండ్ చేసింది. అప్పట్లో ఆ కార్యాలయంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్లు ముగ్గురిని కూడా విధుల నుంచీ తొలగించారు. మరోవైపు తిరుపతి సెగ్మెంట్ ఈఆర్వో నెట్ నుంచీ 35 వేల ఓటరు కార్డులు డౌన్ లోడ్ చేసిన వ్యవహారంపై ఈస్ట్ పోలీస్ స్టేషన్, వెస్ట్ పోలీస్ స్టేషన్‌లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుల విచారణ ఇంకా ఒక కొలిక్కి రాకముందే చంద్రమౌళీశ్వరరెడ్డిని శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మిగిలిన వారి కంటే ఈయన వ్యవహారం భిన్నంగా మారింది. అక్రమంగా ఓటరు కార్డులు డౌన్‌లోడ్ చేసిన ఆరోపణలను ఎదుర్కోవడం ఒక ఎత్తయితే అసలు ఎన్నికల కమిషన్ నియమించకుండానే తనకు తానుగా ఈఆర్వోగా బాధ్యతలు నిర్వహించడమనేది అంతకు మించిన తప్పుగా మారుతోంది. దీంతో ఆయన ఈ వ్యవహారం నుంచీ బయటపడడం మిగిలిన అధికారుల కంటే కష్టమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కడప జిల్లాకు చెందిన ఈ అధికారికి ఇతరత్రా నిజాయితీపరుడనే పేరుంది. అయితే అధికారిగా ప్రజాప్రతినిధుల ఒత్తిడికి సులువుగా తలొగ్గుతారని, వారు చెప్పిన పనులు నిబంధనలకు విరుద్ధంగా వున్నా సరే తూచ తప్పకుండా పాటించి అమలు చేస్తారన్న పేరుంది. దానివల్ల వచ్చే పరిణామాలకు ఆయనే బాధ్యుడవుతుండగా ఇతర అధికారుల తరహాలో అక్రమార్జనకు పాల్పడడం వంటి ఆరోపణలు లేకపోవడం గమనార్హం.దీంతో సస్పెన్షనకు గురైన చంద్రమౌళీశ్వర రెడ్డిపై అధికార, ఉద్యోగ వర్గాల నుంచీ సానుభూతి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఆయన బదిలీపై విజయవాడలో మెప్మా డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయమలా వుంచితే ఈసీ తదుపరి చర్యలు ఎవరి మెడకు చుట్టుకుంటాయోనన్న భయం సంబంధిత అధికారులను, ఉద్యోగులను వెంటాడుతోంది. ఓవైపు పోలీసుల దర్యాప్తు కొనసాగుతుండగా అందులో ఏమి తేలుతుందో, ఎవరెవరు జైలుపాలు కావాల్సి వస్తోందోనని ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న అధికారులు, ఉద్యోగులు హడలిపోతున్నారు.



బతికున్నా ఓటరుగా చంపేశారు!


చనిపోయినా ఓటరు జాబితాలో కొనసాగుతున్న మోహనాచారి, షణ్ముగం, సుబ్బయ్యశెట్టి, జమున, శంకర్‌రెడ్డి, చెంగారెడ్డి, ప్రమీల, పళని

- కొంతమంది చనిపోయినా ఓటరు జాబితాలో బతికేస్తున్నారు

తిరుచానూరు, ఫిబ్రవరి 9 : చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో తప్పులు వెలుగులోకి వస్తూనే వున్నాయి.చనిపోయిన చాలామంది ఓటరు జాబితాలో కొనసాగుతుంటే బతికున్న కొంత మంది ఓట్లను తొలగించేశారు.తిరుపతి రూరల్ మండలంలోని తిరుచానూరు, గాంధీపురం, పాడిపేట, పద్మావతిపురం, అవిలాలతో పాటు చంద్రగిరి మండలంలో ఒక్కో పోలింగ్ కేంద్రంలో సుమారు 20నుంచి 40 వరకు చనిపోయిన వారు ఓటర్లుగా కొనసాగుతున్నారు.పాకాల,చిన్నగొట్టిగల్లు, ఎర్రా వారిపాళెం, రామచంద్రాపురం మండలాల్లో సైతం ఇలాగే వున్నట్లు టీడీపీ నేతలు వాపోతున్నారు. తిరుచానూరులోని పోలింగ్‌కేంద్రం 292లో సుమారు 19మంది చనిపోయిన ఓటర్లు జాబితాలో కొనసాగుతుండడం గమనార్హం.మాజీ ఉప సర్పంచ్ జమునతో పాటు షణ్ముగం, శంకర్‌రెడ్డి, చెంగారెడ్డి, సుబ్బయ్యశెట్టి తదితరులు మరణించి రెండేళ్లు దాటుతున్నా జాబితాలో ఓటర్లుగానే కొనసాగుతున్నారు. పోలింగ్‌కేంద్రం 277లో పళని, మోహనాచారి చనిపోయి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఓటర్లుగా కొనసాగుతున్నారు. పాకాలలోని 94వ పోలింగ్ కేంద్ర పరిధిలో ప్రమీల రెండేళ్ల క్రితం మరణించినా ఓటరు జాబితాలో కొనసాగుతోంది.

ఎమ్మెల్యే చెవిరెడ్డి తండ్రి, తమ్ముడు మరణించినా జాబితాలో కంటిన్యూ

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తండ్రి సి.సుబ్రహ్మణ్యం రెడ్డి, తమ్ముడు సి.హనుమంతరెడ్డి మరణించి ఒకటిన్నర సంవత్సరం గడుస్తున్నా ఓటర్ల జాబితాలో తొలగించలేదు. ఎమ్మెల్యే సమీప బంధువులు సిద్ధప్ప, శకుంతల, రవికుమార్‌రెడ్డి మరణించినా ఓటర్ల జాబితా నుంచి ఇంకా తొలగించలేదు.ఇలా తుమ్మలగుంటలోనే పదుల సంఖ్యలో మృతి చెందిన వారి ఓట్లను తొలగించలేదని క్షేత్రస్థాయిలో పరిశీలించిన టీడీపీ నాయకులు చెబుతున్నారు.



ఓటరు జాబితాలో కొనసాగుతున్న చెవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, హనుమంత రెడ్డి

మేమేం పాపం చేశాం?


సురేష్


విజయలక్ష్మి

తిరుచానూరుకు చెందిన సురేష్ (పోలింగ్ కేంద్రం 277లో-ఎపిక్‌నెంబరు:ఐఏఎక్స్1277137)తన ఓటును జాబితా నుంచి తొలగించడం చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇదే పోలింగ్ కేంద్రానికి చెందిన విజయలక్ష్మి(ఐఏఎక్స్ 1221340) తన ఇంటికి పరిశీలనకు రాకనే చనిపోయానని ఓటర్ల జాబితాలో తొలగించడం ఎంత వరకు న్యాయమని వాపోతున్నారు. కలెక్టర్ అయినా స్పందించి తమ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతంపై ఈ దొంగ ఓట్ల ప్రభావం ఉంటుందని టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా విడుదల చేసిన తరువాత ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద జాబితాను ప్రదర్శించాల్సి వుంది. అయితే చంద్రగిరి నియోజకవర్గంలో అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.దీంతో తమ ఓటు పరిశీలించుకునే అవకాశం లేకుండా పోతోందని జనం వాపోతున్నారు.

విహార యాత్రలో విషాదం

- సద్దికూడు మడుగులో తమిళ యువకుడి గల్లంతు





నాగలాపురం, ఫిబ్రవరి 9:విహార యాత్రకోసం మిత్రులతో కలసి వచ్చిన ఓ తమిళ యువకుడు గల్లంతయ్యాడు.పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం కుంద్రత్తూరు మండలంలోని కొవ్వూరుకు చెందిన శ్యామ్(20) చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో బీకాం మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సెలవులివ్వడంతో తొమ్మిదిమంది స్నేహితులతో కలిసి గురువారం ద్విచక్ర వాహనాలపై విహార యాత్ర కోసం నాగలాపురం మండలంలోని సద్దికూడు మడుగు చేరుకున్నాడు. సాయంత్రం వరకు అక్కడే ఉల్లాసంగా గడిపిన శ్యామ్ నీటిలోకి దిగాడు. మడుగులో నీటి ప్రవాహం ఉధ్రుతంగా ఉండడంతో గల్లంతయ్యాడు. వెంటనే స్నేహితులు నాగలాపురం పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ ఓబయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు యువకుడి ఆచూకీ కనిపించకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు.శుక్రవారం ఉదయమే సత్యవేడు అగ్నిమాపక సిబ్బందితో కలిసి పోలీసులు మడుగు వద్దకు చేరుకున్నారు. రోజంతా ప్రయత్నించినా శ్యామ్ మృతదేహం ఆచూకి లభ్యం కాలేదు. మడుగు ప్రాంతం విస్తీర్ణం తక్కువగా ఉండి చాలా లోతుగా ఉండడంతో మృతదేహాన్ని వెలికితీయడం కష్టంగా మారింది. చీకటి పడడంతో పోలీసులు, అగ్నిమాపక దళం వెనుదిరిగారు. శనివారం మరలా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. శ్యామ్ ఆచూకి లభ్యం కాకపోవడంతో అతడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. శ్యామ్ ఈ జలపాతానికి రావడం మూడోసారని అతని స్నేహితులు తెలిపారు.

సద్దికూడు మడుగు వద్ద అగ్నిమాపక దళం, పోలీసులు - గల్లంతయిన శ్యామ్ (ఫైల్‌ఫొటో)

అయ్యయ్యో.. పదవి ఉన్నా పవరు పాయెనే!

ఇంకా పదవుల్లోనే ఉన్నా పాపం ఆ ఎమ్మెల్యేలు ఇద్దరూ అధికారిక కార్యక్రమాల్లో కనిపించడం లేదు. వారి స్థానంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ప్రకటించిన నాయకులు ఆ కార్యక్రమాల్లో పాల్గొంటూ సందడి చేస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉంది. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం నాలుగో విడత ఆసరా పథకం డబ్బుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జాడ లేదు. కానీ, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ముఖ్య అతిథిగా వచ్చారు. మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, కమిషనరు అరుణ, మెప్మా పీడీ రాధమ్మ తదితర అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి గౌరవ మర్యాదలు చేయడం మరీ విశేషం. గతేడాది ఏప్రిల్ 3న ఇదే నాగయ్య కళాక్షేత్రంలో గుడిపాల మండలానికి చెందిన ఆసరా కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెల నుంచి నియోజకవర్గంలో అన్ని కార్యక్రమాల్లోనూ ఇదే తంతు సాగుతోంది. ఆర్టీసీ వైస్ చైర్మన్ అనే హోదా ఉండడంతో ప్రొటోకాల్ గొడవ కూడా లేదు. ఇక పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తనకు టికెట్ లేదని తెలిసినప్పుడు వైసీపీ అధిష్ఠానంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసి, రెండు రోజులకు మాట మార్చినా.. ఆయన స్థానంలో వైసీపీ అధిష్ఠానం మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను ప్రకటించింది. అప్పటి నుంచి ఎంఎస్ బాబు నియోజకవర్గంలో కనిపించకుండా పోయారు. శుక్రవారం బంగారుపాళ్యంలోని కామరాజు గెస్ట్‌హౌస్‌లో అధికారిక హోదా లేకపోయినా వలంటీర్లతో సునీల్‌కుమార్ సమావేశమయ్యారు కూడా. ఈ సమావేశానికి కచ్చితంగా హాజరవ్వాలని మండల అధికారులు వలంటీర్లను ఆదేశించడం విశేషం.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



చిత్తూరులో నిర్వహించిన ఆసరా కార్యక్రమంలో వైసీపీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి



బంగారుపాళ్యంలో నిర్వహించిన వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్

నేటినుంచి శ్రీకాళహస్తిలో వైజ్ఞానిక ప్రదర్శన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన శనివారం నుంచి శ్రీకాళహస్తిలో రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్ తెలిపారు.శ్రీకాళహస్తిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఆర్బీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక మేళాలో వివిధ మండలాల నుంచి 380 నమూనాలు ప్రదర్శనకు రానున్నట్లు చెప్పారు. ఇందులో 10శాతం ఎగ్జిబిట్స్ ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనే విద్యార్థులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు డీఎస్‌వో పేర్కొన్నారు.సమగ్ర శిక్ష సీఎంవో సురేష్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యమా? రాచరికమా?

● లింగేశ్వరనగర్ పర్యటనలో పులివర్తి నాని ధ్వజం


నానికి మహిళల స్వాగతం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 9: నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం నడుస్తోందా.. రాచరికమా? అని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ధ్వజమెత్తారు. తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర్ నగర్ పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. చంద్రగిరి నియోజకవర్గంలో దోపిడీలు, దౌర్జన్యాలు, గంజాయి విక్రయాలతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని మండిపడ్డారు. చెవిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్అఫిషియో మెంబర్ ఇలా పదవులపై ఉండే దృష్టి నియోజకవర్గ అభివృద్ధిపై లేదన్నారు. రూ.5 వేల కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్, మఠం, ప్రభుత్వ భూముల కబ్జాలు తప్ప మరే ఇతర ధ్యాస ఆయనకు లేదని స్పష్టం చేశారు. గతంలో దొంగ ఓట్లతో గద్దెనెక్కి, మళ్లీ అదే విధంగా గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. వర్షాలకు కొట్టుకుపోయిన బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మించడం, గుంతలు లేని రోడ్లు వేయడం, దళిత, గిరిజన వాడల్లో శ్మశాన వాటికల నిర్మాణం చేయాలన్నారు. లింగేశ్వరనగర్‌లో కాలువలు, రోడ్లు, వీధి లైట్ల సమస్యలున్నాయని స్థానికులు నాని దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి రూరల్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగండి


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్/రామచంద్రాపురం, ఫిబ్రవరి 9: బాగా చదివి తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని శుక్రవారం ఆయన అందజేశారు. తొలుత సీ మల్లవరం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సరస్వతి పూజ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తిరుచ్చిపై అలమేలు మంగ అభయం


తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, ఫిబ్రవరి 9: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి శుక్రవారం ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. వేకువజామున సుప్రభాతసేవతో అర్చకులు అమ్మవారిని మేల్కొపి నిత్య కైంకర్యాలు, మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ, మధ్యాహ్నం అలమేలు మంగతాయారు ఉత్సవమూర్తిని ఫ్రైడేగార్డెన్‌కు వేంచేపు చేసి భక్తుల గోవిందనామస్మరణల మధ్య అర్చకులు తిరుమంజనం నిర్వహించారు. థై మాసం నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి మహిళా భక్తులు పోటెత్తారు. అనంతరం పసుపుదారాలను భక్తులకు పంచిపెట్టారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈఎస్వో శైలేంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీవాణి, మధు, శేషగిరి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, భాస్కర్‌నాయుడు, అశోక్ పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌బాబు

చంద్రగిరి, ఫిబ్రవరి 9: కృషి, దీక్ష, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చునని ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు అన్నారు. ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ప్రథమ సంవత్సరం చేరిన విద్యార్థులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువే బ్రహ్మ, గురువే విష్ణు, గురువే మహేశ్వరుడు అని ప్రతి విద్యార్థి భావిస్తే జీవితంలో పురోభివృద్ధి సాధిస్తారని తెలిపారు. ధ్యేయం మరిచిపోకుండా, కన్న తల్లిదండ్రులకు కన్నీరు రాకుండా చూసుకున్నప్పుడే వారికి మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం



చంద్రగిరి, ఫిబ్రవరి 9: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి, శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉభయదేవేరుల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంటస్వామిని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేధర్ చిరంజీవులు పాల్గొన్నారు.

అన్నదాత ఉభయదారులకు సన్మానం



చంద్రగిరి, ఫిబ్రవరి 9: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం చేసిన ఉభయదారులను ఆలయ ఛైర్మన్, పాలక మండలి సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. శుక్రవారం చంద్రగిరికి చెందిన జల్లా గంగిరెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని ఆదరించండి


దామలచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న పులివర్తి సుధారెడ్డి

పాకాల, ఫిబ్రవరి 9: రాష్ట్ర అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే తెలుగుదేశం పార్టీని ఆదరించాలని పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. దామలచెరువులో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, మీ ఇంటివద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంచుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యేగా పులివర్తి నానిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీకటి రాజ్యంలో దారిదీపం.. మిణుగురులు

● పుస్తక పరిచయ సభలో వక్తల ప్రశంసలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 9: ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి రాసిన 'మిణుగురులు' వంటి పుస్తకాలు చీకటి రాజ్యంలో దారిదీపాల్లా నిలుస్తాయని పలువురు వక్తలు ఆ పుస్తక పరిచయ సభలో అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన సభలో హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేవై రత్నం మాట్లాడుతూ.. మన దేశంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళల అద్వితీయ వీరగాథలను ఈ పుస్తకం తెలియ చేస్తుందన్నారు. సమాజం కోసం అట్టడుగు వర్గాల స్త్రీలు చేసిన వీరోచిత త్యాగాలను రచయిత్రి సజీవంగా అందించారని తెలిపారు. మానవ జీవితం చుట్టూ చీకట్లు అలుముకుంటున్న దశలో ఇలాంటి పుస్తకాలు వెలుగును ప్రసరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సుభాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ.. నేటికీ కులం వివిధ రూపాల్లో మానవానుభవంలోకి వస్తూనే ఉందన్నారు. కులం లేదనుకోవడం పచ్చి అబద్ధమని చెప్పారు. కుల రహిత సమాజం కోసం ఈ తరం పనిచేయాలని కోరారు. సీఐటీయూ నేత కందారపు మురళి మాట్లాడుతూ.. కార్మికులు పని చేసే చోట లైంగిక హింసను అనుభవిస్తున్నారంటూ టీటీడీ కాంట్రాక్టు కార్మికుల వెతలను వివరించారు. రచయిత ఆర్ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల చరిత్రను తవ్వుకుని వెలుగులోకి తీసుకురావాలనే స్ఫూర్తిని మిణుగురులు పుస్తకం ఇస్తోందన్నారు. రచయిత్రి చల్లపల్లి స్వరూపారాణి తన స్పందన తెలియజేస్తూ తన ప్రయాణాల్లో తారసపడిన, తెలిసిన సాధారణ మనుషులే ఈ పుస్తకం రాయడానికి కారణమని వివరించారు. కుల వివక్ష ఎంత బలంగా వేళ్లూనుకుని పోయివుందో ఆమె తెలియజేశారు. ఆర్వీపీ అధ్యక్షుడు పి.అంజయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో కవి గొడుగుచింత గోవిందయ్య పాల్గొన్నారు.

అనుభవాన్నే అక్షరీకరించా..

కాగా, మధ్యాహ్నం పద్మావతి మహిళా యూనివర్శిటీ ఇంగ్లిషు విభాగంలో రచయిత్రి చల్లపల్లి స్వరూపరాణితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పుస్తకాల్లో చదువుకున్న అంశాలతో పాటు జీవిత అనుభవాలను కవిత్వంగా రాయడానికి ప్రయత్నం చేశానని ఆమె చెప్పారు. అనేక మంది రచయితలు, చరిత్ర తనలో స్ఫూర్తి నింపిందన్నారు. సామాజిక ఉద్యమాల చైతన్యం రచయిత్రిగా తనను తీర్చిదిద్దిందని చెప్పారు. రచయిత వీఆర్ రాసాని తెలుగు సాహిత్యంలోనూ, దళిత సాహిత్యంలోనూ చల్లపల్లి స్వరూపారాణికి ఉన్న ప్రత్యేకతను సోదాహరణంగా వివరించారు. ఇంగ్లిషు డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ తుమ్మపూడి భారతి పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని విభాగాల సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలని కలెక్టర్ లక్ష్మీశా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి ఎన్నికల విధులు కేటాయించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల మేరకు ఎలాంటి అవాంతరాలూ కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, నెట్‌వర్క్ సిగ్నల్స్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. ప్రధాన చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ డబ్బు, మద్యం రవాణా జరగకుండా నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టీ ఉమేష్‌కుమార్, సెబి సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు రమేష్, కిరణ్‌కుమార్, చంద్రముని, నిశాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, నరసింహులు, భాస్కర్ నాయుడు, జ్యోతి, శంకర్‌నారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ న్యాయమూర్తి


జస్టిస్ సూర్యపల్లి నంద

తిరుమల, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యపల్లి నంద శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజ స్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం జస్టిస్ సూర్యపల్లి నందను రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివజ్ఞానం కూడా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

కర్రసాములో నారాయణ విద్యార్థులకు పతకాలు


నేహారెడ్డి, భువన్‌చంద్రారెడ్డిలతో కోచ్ ఈశ్వర్, హిమబిందు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 9: నెల్లూరులోని సింహపురి స్పోర్ట్స్ అకాడమీలో ఈ నెల 4న సౌతిండియా స్థాయిలో నిర్వహించిన తొలి కర్రసాము పోటీలలో తిరుపతికి చెందిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు పి.నేహారెడ్డి, పి.భువన్ చంద్రారెడ్డి పతకాలు సాధించారని కోచ్ ఈశ్వర్ పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో నేహారెడ్డి మూడు విభాగాల్లో వరుసగా మూడు బంగారు పతకాలు సాధించగా, క్యాడెట్ విభాగంలో భువన్‌చంద్రారెడ్డి మూడు విభాగాల్లో రజిత, కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థుల తల్లి పి.హిమబిందు తిరుపతి ఎమ్మార్‌పల్లెలోని జెడ్పీహైస్కూల్‌లో వ్యాయామ టీచర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థులను జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఆర్.వంశీరాజా, టీచర్లు సుబ్రమణ్యం అభినందించారు.

మజ్జిగ కాలువ కబ్జా

● పోలీసు, రెవెన్యూ అండతో ప్రహరీ నిర్మాణం
● ఆక్రమించిన 35 సెంట్ల విలువ రూ.7 కోట్లు పైమాటే


కబ్జాకు గురైన మజ్జిగ కాలువ

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని మజ్జిగ కాలువ కబ్జాకు గురవుతోంది. తిరుపతి అర్బన్ సర్వే నెంబరు 242-1బిలో గల 35 సెంట్ల మజ్జిగ కాలువ ఆక్రమణలో పోలీసు, రెవెన్యూ అధికారులే సూత్రధారులనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కోట్లాది రూపాయలు విలువ చేసే ఈ కాలువ ఆక్రమణ పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక అధికార పార్టీ నాయకులు కూడా ఉన్నారని ఆరోపిస్తున్నారు. ఎంఆర్ పల్లె పోలీసు స్టేషన్ ఎదురుగా, అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో యథేచ్ఛగా సాగుతున్న ఈ ఆక్రమణలపై ఇంతవరకూ ఎవ్వరూ స్పందించకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది. గత నవంబరులో కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమణదారులు చదును చేశారు. దీనిపై స్థానికంగా నివాసం ఉంటున్న కొందరు అంబేడ్కర్ చిత్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆక్రమణను నిరసిస్తూ ఎంఆర్ పల్లె పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పేదలు ఒక్క సెంటు ఆక్రమించుకుంటే హుటాహుటిన తొలిగించి నానా హంగామా చేసే రెవెన్యూ యంత్రాంగం, దీనిపై ఊసెత్తకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఆక్రమించిన 35 సెంట్ల ఈ భూమి విలువ రూ.7 కోట్ల పై మాటేనని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆక్రమణ స్థలానికి ఏకంగా పక్కా ప్రహరీ నిర్మాణం చేపట్టడం గమనార్హం. ఈ వ్యవహారంపై స్థానికులు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

వైసీపీ నేత భూకబ్జాను అడ్డుకోండి

● తహసీల్దారుకు భాకరాపేట గ్రామస్తుల వినతి


స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీ

భాకరాపేట, ఫిబ్రవరి 9: అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేపడుతున్న వైసీపీ నేత భూకబ్జాను అడ్డుకోవాలని టీడీపీ నేత దాసరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భాకరాపేట గ్రామస్తులు శుక్రవారం చిన్నగొట్టిగల్లు తహసీల్దారు నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ భాకరాపేటకు చెందిన కొంతమంది రైతులకు దిగవూరు రెవెన్యూ గ్రామం సర్వే నెం.519, 521లకు ఆనుకుని పట్టా భూములు ఉన్నాయన్నారు. ఆ భూములలో రైతులు పూర్వ కాలం నుంచి వర్షాధార పంటలు వేసుకోవడం, పశువులు మేపుకోవడం చేస్తున్నారన్నారు. ఆ భూములకు కొద్ది దూరంలోనే జాతీయ రహదారి వెళుతున్నందున వాటికి విలువ పెరిగిందని, దాన్ని అదునుగా చేసుకుని వైసీపీ నేత, సర్పంచ్ అయిన సాకిరి భూపాల్ వాటిని ఆక్రమించుకునేందుకు చదును చేస్తున్నాడన్నారు. సుమారు 7 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఆ భూములు ఆక్రమణకు గురైతే పశువులు మేపుకునేందుకు కూడా స్థలం ఉండదని, అందువల్ల దానిని ఆక్రమణల బారి నుంచి కాపాడాలన్నారు. దానిపై హైకోర్టులో రిట్ పిటీషన్ వేశామని, అది విచారణకు రాకుండా పెండింగ్‌లో ఉందని వారు తహసీల్దారుకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గురుప్రకాశ్, తులసీరాయల్, మదనమోహన, డిష్ మణి తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న భాకరాపేట గ్రామస్తులు

టీడీపీ పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగింది

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9: వైసీపీ ప్రభుత్వంతో విసుగుచెందిన ప్రజానీకం టీడీపీ పట్ల మొగ్గు చూపుతున్నారని పులివర్తి వినీల్ అన్నారు. మండలంలోని నడవలూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు జనార్దన చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, గిరినాయుడు, సురేంద్రనాయుడు, కమలాకర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, చైతన్యరెడ్డి, నాగరాజు, రమేష్, శ్రీనివాసులు రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, యోగీశ్వరరెడ్డి పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న వినీల్

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తాం


ఓంప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేసిందన్నారు. వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ముందుకెళుతోందన్నారు. అనంతరం చిట్టత్తూరు గ్రామానికి చెందిన ఓంప్రకాష్‌రెడ్డిని పార్టీ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కొంతమంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కేవీఎస్ వాసు, కే.రాజేంద్ర, సురేష్, ఉషారెడ్డి, ప్రేమ్‌కుమార్, నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో జేసీ తనిఖీలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9: మండలంలోని రామాపురంలో ఉన్న వెరిటాస్ సైనిక్ స్కూల్‌ను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులతో పాటు మౌలిక వసతులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

శ్రీచైతన్యలో స్పోర్ట్స్ డే


పతకాలు సాధించిన విద్యార్థులతో ట్రాఫిక్ ఏఎస్ఐ రాజారావ్, ప్రిన్సిపాల్ జయప్రకాశ్, కిశోర్‌బాబు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 9: జీఎస్‌మాడవీధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో శుక్రవారం స్పోర్ట్స్ డేని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ట్రాఫిక్ ఏఎస్ఐ రాజారావ్‌తో ఏజీఎం జి.సురేష్ కలసి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో సమానంగా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా శారీరక, మానసిక వికాసాభివృద్ధిని సాధించవచ్చని తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ జయప్రకాష్, డీన్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు, టీచర్లు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా ఏకాగ్రత పెంపు



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 9: విద్యార్థి దశలో క్రీడల్లో భాగస్వామ్యం కావడం ద్వారా శారీరక, మానసిక వికాసంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు పేర్కొన్నారు. వరదరాజనగర్ శ్రీపురంకాలనీలోని భాష్యం స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పేరెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల పట్ల ప్రోత్సహించాలన్నారు. వాకింగ్, యోగా సాధన చేయడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయని తెలిపారు. తల్లిదండ్రులతో ఏరోబిక్స్, యోగాసనాలను సాధన చేయించారు. జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్, ప్రిన్సిపాల్ బాలాజి, లిటిల్ ఛాంప్స్ ఇన్‌చార్జి సుధాకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ మృతికి నివాళి

● గణేష్ స్మారక మందిరం ఏర్పాటు : ఎస్పీ శ్రీనివాస్


గణేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9: అన్నమయ్య జిల్లా కేవీపల్లి వద్ద ఎర్రచందనం స్మగ్లర్ల కారు ఢీకొని మరణించిన కానిస్టేబుల్ గణేష్(32) మృతికి శుక్రవారం టాస్క్‌ఫోర్సు అధికారులు, సిబ్బంది కపిలతీర్థం సమీపంలోని కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. రైల్వే కోడూరు, కడప సబ్ డివిజన్ల నుంచి సిబ్బంది హాజరై పుష్పాంజలి ఘటించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో ఒక సమావేశ మందిరానికి గణేష్ స్మారక సమావేశ మందిరంగా నామకరణం చేస్తామని తెలిపారు. సిబ్బంది వ్యక్తిగత రక్షణపై శిక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గణేష్ కుటుంబానికి తగిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఆయన మరణానికి కారకులను పట్టుకుని శిక్ష పడేలా చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ(ఏఆర్) సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో మురళీకృష్ణ పాల్గొన్నారు.

కరాటే శీనుకు సన్మానం



తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 9: ఈఎస్ఐ ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడిగా నియమితులైన వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యుడు కరాటే శీనును ఆ కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కమిటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎస్వీఎం వెంకటేష్, డీపీ ఆనంద్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, చెంగారెడ్డి, చెన్నం నవీన్, పార్థసారథి, నవీన్ రాయల్, వాసు, కిరణ్, మణి, కల్యాణ్ తదితరులు పాల్గొని ఆయన్ను అభినందించారు.

ఎస్వీ హైస్కూలు మైదానంలో నిర్మాణాలు ఆపండి


సమావేశంలో మాట్లాడుతున్న ఊకా విజయ్‌కుమార్

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 9: ఎస్వీ క్రీడా మైదానంలో జరుగుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. యూత్ హాస్టల్లో శుక్రవారం ఎస్వీ హైస్కూలు పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల మౌలిక వసతుల కోసం మైదానాన్ని వాడుకుంటే అభ్యంతరం లేదని, ఇతర ప్రయోజనాల కోసం నిర్మాణాలు చేపట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే టీటీడీ పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మధు, గుండ్లూరు వెంకటరమణ, అబ్బులు, వీరమోహన్, దేవరాజులు, లక్ష్మీనారాయణ, లీలాకృష్ణ, బాలశివకుమార్, రవీంద్రగుప్త, పురుషోత్తం, పి.సుబ్రమణ్యం, తులసీరామిరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ అభివృద్ధిలో సదాభార్గవి సేవలు అభినందనీయం



తిరుపతి(విద్య),ఫిబ్రవరి9: టీటీడీలో జేఈవోగా సదాభార్గవి నాలుగేళ్లపాటు ఎంతో సమర్థవంతమైన సేవలను అందించారని ఈవో ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం బదిలీపై వెళుతున్న సదాభార్గవికి ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఈవో మాట్లాడుతూ ఆరోగ్యం, విద్యా విభాగాలతో పాటు ఇతర విభాగాలను చక్కగా నిర్వహించారని గుర్తు చేశారు. స్విమ్స్ ఆస్పత్రిని ఆరునెలల్లో ఎంతో అభివృద్ధి చేసి రోగుల్లో విశ్వాసం పెంచారని, టీటీడీ డిగ్రీ కాలేజీలకు న్యాక్ ఏప్లస్ గ్రేడ్‌తోపాటు అటానమస్ హోదా లభించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. గత బ్రహ్మోత్సవాల్లో నైపుణ్యం ఉన్న కళాబృందాలను ఎంపిక చేసి భక్తుల మన్ననలు పొందారని, ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో జేఈవోగా ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. సదాభార్గవి మాట్లాడుతూ టీటీడీలో మూడు సంవత్సరాల ఎనిమిది నెలలు పనిచేసే అవకాశం రావడం తనపూర్వజన్మ సుకృతమని అన్నారు. తన ఉద్యోగకాలంలో సహకరించిన మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రస్తుత ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, అప్పటి ఈవోలు అనిల్‌కుమార్ సింఘాల్, డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రస్తుత ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమెను సన్మానించారు.

తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా భీమనేని



పాలసముద్రం/ వెదురు కుప్పం, ఫిబ్రవరి 9: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న భీమనేని చిట్టిబాబు నాయుడును ఎన్నికల నిమిత్తం తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. శుక్రవారం పాల సముద్రంలో భీమనేని విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబుకు, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు, ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నా యుడుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

తెరవెనుక నాయకులపై చర్యలు తీసుకోవాలి



తిరుపతి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తిరుపతి దొంగ ఓట్ల వ్యవహారంలో రోజుకో అధికారి బలవుతున్నారని, వీరితో పాటు రాజకీయ నేతలపైనా చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్ డిమాండు చేశారు. శుక్రవారం పోస్టల్ కాలనీలో ఓటరు పరిశీలన కార్యక్రమంలో సుగుణమ్మ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అధికారులు చేసిన బోగస్ ఓట్ల వ్యవహారం కారణంగా రాజకీయ పార్టీ నేతలు ఇంటింటికీ ఓటరు జాబితాను పరిశీలించే దౌర్భాగ్యం పట్టిందన్నారు. ఇకనైనా అధికారులు పారదర్శకంగా ఉండాలన్నారు. తెరవెనుక ఉన్న నాయకులపైనా ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలన్నారు. సస్పెండ్‌కు గురైన అధికారులపై పోలీస్ విచారణ పారదర్శకంగా జరగాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు హేమంత్ రాయల్, వెంకటేష్, కృష్ణయ్య, రమేష్ రెడ్డి, నాగరాజు, సునీల్, చలపతి, ధనంజయులు, సుబ్రమణ్యం నాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీసీఎల్ టీ20 క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 9: చిత్తూరు క్రికెట్ లీగ్(సీసీఎల్) టీ20 సెలక్షన్స్ ఆదివారం నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో తుమ్మలగుంట మైదానం, చిత్తూరులో పోలీస్ పరేడ్ గ్రౌండ్, మదనపల్లిలో మాస్టర్‌మైండ్ స్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. 1994 సెప్టెంబరు 1 నుంచి 2008 సెప్టెంబరు 1న మధ్య జన్మించిన వారు అర్హులని, ఆసక్తిగలవారు తెల్లని దుస్తులు, క్రీడా సామగ్రితో హాజరుకావాలని వివరించారు. మరింత సమాచారం కోసం 9849026131(తిరుపతి), 9014440543(చిత్తూరు), 7013031459(మదనపల్లె)లను సంప్రదించాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,357 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,924 మంది తలనీలాలు సమర్పించారు.

నేటినుంచి ఆర్ట్ క్యాంప్

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 9: తిరుపతి ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజులు ఆర్ట్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ఆవరణలో ఉదయం 10.30 గంటలకు టీటీడీ విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.భాస్కరరెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు. భారతీయ వారసత్వం-సంస్కృతి అనే అంశంపై 50 మంది చిత్ర కళాకారుల లైవ్ పెయింటింగ్ ఉంటుంది. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శన ఉంటుంది.

తిరుమలేశుని దర్శించుకున్న హీరో దర్శన్



తిరుమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ హీరో దర్శన్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత గర్భాలయంలో మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల విడుదలైన 'కాటేరా' చిత్రం మంచి విజయం సాధించిందన్నారు. త్వరలో 'డెవిల్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తానన్నారు. అలాగే రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, మంత్రులు అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి, సమాచార కమిషనర్ ఐలపురం రాజా, ఎమ్మెల్యే రఘురాజు, ప్రభుత్వ విప్ విక్రాంత్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

12న అప్రెంటీస్‌షిప్ మేళా

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 9 : పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 12న ఉదయం 9 గంటలకు అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈవో) జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 2020-21 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు, 2024మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యే సీనియర్ ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులు హాజరుకావచ్చని తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు హాజరై విద్యార్థులను అప్రెంటిస్‌కి ఎంపిక చేస్తారని, చదివిన కళాశాలలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలను వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9441451338ను సంప్రదించాలని కోరారు.

ఎంజీఎం విద్యార్థి భవ్యకు అభినందన

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 9: బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతూ హాకీ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థి కె.భవ్యని శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశా అభినందించారు. ఆమె 2023లో వైజాగ్‌లో నిర్వహించిన అండర్-17 హాకీ పోటీలలో రాష్ట్రస్థాయిలో బ్రాంజ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ ఏడాది జనవరిలో కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభచాటింది. అభినందన సభలో హెచ్ఎం మురుగన్, వ్యాయామ టీచర్ ఎం.ప్రసన్నలక్ష్మి, టీచర్లు బండి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల రిలే నిరాహారదీక్షకు నానీ సంఘీభావం

తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 9: ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయాలని తిరుపతి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు టీడీపీ చిత్తూరు జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, చంద్రగిరి ఇన్‌చార్జి పులివర్తి నాని శుక్రవారం సంఘీభావం తెలిపారు. తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటకుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు చేపట్టిన ఈ దీక్షలో నాని తన అనుచరులతో గంటసేపు పాల్గొన్నారు. నాని మాట్లాడుతూ సామాన్య ప్రజల భూహక్కులకు విఘాతం కలిగించేలా ఈ చట్టం ఉందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అయితే కక్షిదారుల సౌలభ్యం కోసం శుక్రవారం నుంచి విధులకు హాజరుకావాలని తీర్మానించారు. యాక్ట్‌ను రద్దు చేసే అందోళన కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎం.మణి, లగిశెట్టి వెంకటరమణ, గోపీచంద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



సర్టిఫికెట్ అందిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 9: రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా తిరుపతి డిపో గ్యారేజీలో శుక్రవారం రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ప్రారంభించారు. డిపో అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్స్, ఇతర సిబ్బంది రక్తదానం చేసి, సర్టిఫికెట్లు తీసుకున్నారు.

ముగిసిన మహారుద్రాభిషేకం



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 9: హైదరాబాదుకు చెందిన గురుదత్త మఠం వ్యవస్థాపకుడు, దత్తోపాసకులు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో మహారుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజా మహోత్సవం శుక్రవారం ముగిసింది. రెండవ రోజు ఉదయం నుంచి పలు పూజాదికాలు నిర్వహించారు. పద్మావతికల్యాణ మండపం-2లో మాసశివరాత్రి సందర్భంగా 70 మంది వేద పండితులు కామాక్షి అమ్మవారికి పదివేల సార్లు దుర్గాసూక్తంతో అభిషేకించారు. పూర్ణాహుతితో కార్యక్రమం ముగిసింది. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

పీవీకి భారతరత్న హర్షణీయం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 9 : భారత మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు పివి.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు తిరుపతి భారతీయ విద్యాభవన్ సంచాలకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీవీకి భారతీయ విద్యాభవన్‌తో ఎంతో అనుబంధముందని తెలిపారు. గతంలో బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షుడిగా, పీవీ నరసింహారావు కార్యదర్శిగా హైదరాబాదు భారతీయ విద్యాభవన్ గొప్పగా పనిచేసిందని గుర్తు చేశారు.

20కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్ట్



పట్టుబడిన నిందితులను, గంజాయిని చూపుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9: తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురిని తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.లక్షల విలువజేసే 20కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడ అర్బన్ కృష్ణలంకకు చెందిన లేట్ కనకరావు భార్య బండారి రూపవతి (65), కృష్ణలంక రణధీర్ నగర్‌కు చెందిన కోటేశ్వరరావు భార్య బండారి కుమారి (45), విజయవాడ అర్బన్ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన నాగరాజు భార్య వీరంకి దుర్గ (52) నరసారావుపేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి కేజీ రూ.5వేల చొప్పున గంజాయి కొనుగోలు చేస్తుంటారు. దానిపై మరికొంత లాభం వేసుకుని తిరుపతి సంజయ్‌గాంధీకాలనీలో నివాసముంటున్న చిత్తూరు జిల్లా నగరి మండలం ఓజికుప్పానికి చెందిన హరిప్రసాద్ కుమారుడు సత్తుపాటి లోకేశ్వరరావు (47)కు విక్రయిస్తుంటారు. ఆయన చిన్నచిన్న ప్యాకెట్లుగా విభజించి ఒక్కో ప్యాకెట్ రూ.200 చొప్పున పుత్తూరు, నగరి ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గురువారం సాయంత్రం డీఆర్ మహల్ రోడ్డులోని రైల్వే హాలిడేహోమ్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు మహిళలు, ఓ పురుషుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 20 కేజీల గంజాయి లభించింది. దాని విలువ రూ.4 లక్షలు ఉంటుందని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపనున్నట్లు చెప్పారు. వీరిలో ఎ1 ముద్దాయి లోకేశ్వరరావుపై గతంలో తమిళనాడులో దొంగతనం కేసులు ఉన్నాయని, వాటికి సంబంధించి జైలుశిక్ష కూడా అనుభవించాడని చెప్పారు. మహిళా నిందితుల్లో రూపవతి, వీరంకి దుర్గలపై విజయవాడ, తాడేపల్లి ప్రాంతాల్లో జూదం, గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నట్టు వివరించారు. పెద్దమొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నందుకుగాను ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి, సిబ్బంది మునిరాజులు, జ్యోతినాథ్, రవికుమార్, చిరంజీవి, మణికంఠలను అభినందించారు.

భగవన్నామస్మరణతో కష్టాలు దూరం: విద్యాదీశ తీర్థ



కార్యక్రమంలో పాల్గొన్న భజన మండళ్ల సభ్యులు - యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్న విద్యాదీశతీర్థస్వామి

తిరుమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో యజ్ఞాలు, యాగాలు, తపస్సు చేయకపోయినప్పటికీ హరినామస్మరణ చేస్తే ఎంతటి కష్టమైనా దూరమవుతుందని ఉడిపి పాలిమారు మఠాధిపతి విద్యాదీశతీర్థ అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో నిర్వహిస్తున్న పురందరదాసు ఆరాధన మహోత్సవం రెండవ రోజైన శుక్రవారం ఆయన మాట్లాడుతూ పురందరదాసు కీర్తనలు యావత్తు లోకోక్తులేనన్నారు. మానవాళికి పురందరదాసు జీవితసారమే ఆదర్శప్రాయమన్నారు. కేవలం ధనార్జనే ప్రధానంగా భావించిన వ్యక్తి తాను ఎదుర్కొన్న కొన్ని సంఘటనల ద్వారా జ్ఞానసిద్ధిపొంది ప్రఖ్యాత హరిదాసులుగా ఖ్యాతి చెందారన్నారు. దాస పదాల ద్వారా అందరికీ అర్థమయ్యేలా సులువుగా భవవంతుని తత్వాన్ని, శరణాగతి విధానాన్ని, ధర్మాన్ని, నైతిక విలువలను తెలియజేశారని వివరించారు. అనంతరం దాససాహిత్యంలో విశేష కృషి చేసిన 12 మంది యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలను పాలిమారు మఠం ఉత్తరాధికారి విద్యారాజేశ్వరతీర్థతో కలిసి అందజేశారు. అంతకుముందు దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

మైమరపించిన దాసపదాల సంకీర్తనగానం

తిరుమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో శుక్రవారం పురందరదాసు సంకీర్తనగానం భక్తులను మైమరపించింది. పురందరదాసు ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతి పరిణయోత్సవ వేదికకు చేరుకున్నారు. అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సవమూర్తులకు ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ సేవలో టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాస సంకీర్తనల గానం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉడిపి పాలిమారు మఠాధిపతి విద్యాదీశతీర్థ, ఉత్తరాధికారి విద్యారాజేశ్వరతీర్థ, దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు పాల్గొన్నారు.



అపరిశుభ్రతతోనే నులిపురుగులు



విద్యార్థినికి నులిపురుగు నివారణ మాత్ర వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 9 : పరిసరాల, వ్యక్తిగత అపరిశుభ్రత వల్లే పిల్లలకు నులిపురుగులు సంక్రమిస్తాయని కలెక్టర్ లక్ష్మీశా అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బైరాగిపట్టెడలోని ఎంజీఎం ప్రాథమిక పాఠశాలలో ఆయన విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 19 ఏళ్ల లోపు బాలబాలికలకు తప్పకుండా మాత్రలు అందించాలన్నారు. డీఎంహెచ్‌వో శ్రీహరి మాట్లాడుతూ నులిపురుగుల మాత్రలు వేసుకోవడం ద్వారా రక్తహీనత నియంత్రణలోకి వస్తుందన్నారు. వ్యాధి నిరోధక శక్తితో పాటు ఏకాగ్రత మెరుగుపడుతుందన్నారు. రాష్ట్రీయ బాల స్వచ్ఛత కార్యక్రమం వైద్యాధికారిణి పద్మావతి, డీపీఎంవో శ్రీనివాసులు, డీఎంవో రూప్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు గంటలు ఆలస్యంగా వందేభారత్ రైలు

తిరుపతి,(ఆటోనగర్) ఫిబ్రవరి 9: తిరుపతి-సికింద్రాబాద్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. మధ్యాహ్నం 3.15 గంటలకు వెళ్లాల్సి ఉండగా సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరింది. మూడు గంటలకే స్టేషన్‌కు చేరుకున్న ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. గమ్య స్థానాలకు త్వరగా చేరుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన రైలు కూడా ఆలస్యంగా బయలుదేరడంపై అసహనం వ్యక్తం చేశారు.

మహాసంకల్ప సభను విజయవంతం చేయండి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 9: గుంటూరులో ఈ నెల 14న జరిగే అధిక జన మహాసంకల్ప సభను విజయవంతం చేయాలని అంబేడ్కర్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు మురగేషన్ ప్రభు కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ఏమి చేయాలనే ఆలోచనతో ఇదివరకే 12 జిల్లాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నామన్నారు. 14న జరిగే సభలో వీటిపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరి, పెరుమాల్, మురళి, అభిషేక్ పాల్గొన్నారు.

టీటీడీ విద్యార్థులకు అవార్డుల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి9 : టీటీడీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎంతో అదృష్టవంతులని, క్రమశిక్షణతో మెలిగి ఆదర్శంగా నిలవాలని ఈవో ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మహతి ఆడిటోరియంలో నిర్వహించిన స్టూడెంట్స్ సక్సెస్ మీట్-అచీవర్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చి మాట్లాడారు. టీటీడీ ఆధ్వర్యంలోని 27 విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులను ఒకేవేదికపైకి తీసుకొచ్చి అవార్డులు అందించడం సంతోషంగా ఉందన్నారు. టీటీడీ కాలేజీల్లో అధ్యాపకుల కొరతను అధిగమించేందుకు 120మంది నియామకానికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. జేఈవో సదాభార్గవి మాట్లాడుతూ విద్యార్థులకు ఔట్‌డోర్ టూర్ ఏర్పాటు చేసి, పలు వైజ్ఞానిక విషయాలను తెలుసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఎస్వీవేదిక్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఇతరులను పోటీగా భావించరాదని, మీతో మీరే పోటీపడి లక్ష్యాన్ని సాధించాలని చెప్పారు. ముఖ్య గణాంక అధికారి శేష శైలేంద్ర మాట్లాడుతూ విద్యతోపాటు ఆర్ష విజ్ఞానాన్ని బోధించాలని, తద్వారా వారిని ఆధ్యాత్మికంగా జ్ఞానవంతులు చేయాలని ఆకాంక్షించారు. టీటీడీ డీఈవో డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఒకే మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నడిచే మూడు కాలేజీలకు న్యాక్ ఏప్లస్ గ్రేడ్‌తో పాటు అటానమస్ హోదా లభించడం చారిత్రాత్మక విషయమని చెప్పారు. అకడమిక్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, కల్చరల్, కోకరిక్యులర్, కాంపిటేటివ్ ఎగ్జామ్స్, ప్లేస్‌మెంట్స్ వంటి అంశాలలో ప్రతిభచాటిన 215 మంది విద్యార్థులకు 5గ్రాముల వెండిడాలర్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

రుయాలో పోటాపోటీ ధర్నాలు

- రెండు యూనియన్ల నేతలు దాడులకు యత్నం
- సర్దిచెప్పిన పోలీసులు



గత శుక్రవారం రుయాస్పత్రిలో దాడులకు దిగుతున్న వారిని అదుపుచేస్తున్న పోలీసులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 9 : రుయాస్పత్రిలో పారిశుధ్య ఏజన్సీ నిర్వాహకులు నిబంధనలు పాటించడంలేదని, పారిశుధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. రెండు వర్గాలుగా విడిపోయిన కార్మికులకు యూనియన్ల నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. శుక్రవారం కూడా రెండు యూనియన్ల నేతలు రుయా పరిపాలన భవనం ఎదుట పోటాపోటీగా ఆందోళనలకు దిగారు. ఒకానొక సమయంలో ఇరువర్గాల వారు దాడులు చేసుకునే పరిస్థితి నెలకొనడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి పంపారు. వారం కిందట కూడా ఇదే రీతిలో ఇరువర్గాల నేతలు ఆస్పత్రి ఆవరణలో భారీ ఎత్తున ఆందోళనలకు దిగడంతోపాటు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువర్గాలను అదుపు చేసి నచ్చజెప్పి పంపారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని కార్మికులు అంటున్నారు.

మన వారధికి బెస్ట్ అవార్డు

తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని శ్రీనివాస సేతుకు ఎక్స్‌లెన్స్ ఇన్ బ్రిడ్జి ఇంజనీరింగ్‌లో బెస్ట్ అవార్డు దక్కింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జి ఇంజనీర్స్ (ఐఐబీఈ) సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ముంబైలో అవార్డును అందజేశారు. దేశవ్యాప్తంగా 50 ఫ్లైఓవర్లు నామినేషన్లలో పాల్గొనగా అందులో తిరుపతి వారధి మొదటి స్థానంలో నిలిచింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, ఆఫ్కాన్స్ తిరుపతి మేనేజర్ రంగస్వామి తదితరులు అవార్డును అందుకున్నారు. వర్చువల్‌గా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పాల్గొన్నారు.



ముంబైలో అవార్డు అందుకుంటున్న మున్సిపల్ ఇంజనీర్లు

టీచర్లు లేని ఇంగ్లిష్ మీడియం ఎందుకు?



పోస్టర్లను విడుదల చేస్తున్న దళిత సంక్షేమ సేవా సంఘం సభ్యులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం చదువులు ప్రకటనలకే పరిమితమయ్యాయని, కనీసం ఆ సబ్జెక్టు చెప్పడానికి టీచర్లు లేకపోవడమే ఇందుకు నిదర్శనమని దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల డబ్బంతా తిరిగితిరిగి మద్యం దుకాణాలకే వెళుతోందన్నారు. దళితుల భూములను అగ్రవర్ణాల వారు కొనుగోలు చేసి, రెగ్యులరైజ్ చేసుకుని కోట్లు గడిస్తున్నారని పేర్కొన్నారు. దళితుల వద్దనున్న డీకేటీ పట్టాలకు బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రసాద్, జశ్వంత్, బాబు, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలెక్ట్ మొబైల్‌షాప్ మేనేజర్‌పై కేసు



బాలకృష్ణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9: తిరుపతి సెలెక్ట్ మొబైల్‌షాప్ మేనేజర్ బాలకృష్ణపై కేసు నమోదైంది. కంపెనీకి చెందిన రూ.8.88 లక్షల మొత్తాన్ని కాజేసినందుకుగాను ఆయనపై పోలీసులు కేసునమోదు చేశారు. స్థానిక తిలక్ రోడ్డులోని కృష్ణతులసి ప్యారడైజ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సెలెక్ట్ మొబైల్ షాప్ స్టోర్ మేనేజర్‌గా పి.బాలకృష్ణ పనిచేస్తున్నారు. ఇటీవల ఆడిట్ నిర్వహించగా లక్షల రూపాయల నగదుకు సంబంధించి లెక్క తేలలేదు. మేనేజర్‌ను ప్రశ్నించినా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. షోరూమ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అరుణ్‌తో కలిసి మేనేజర్ కంపెనీకి చెందిన రూ.8,88,530 సొంతానికి వాడుకున్నట్లు గుర్తించిన సెలెక్ట్ మొబైల్ షోరూమ్ అధికారి, హైదరాబాద్‌కు చెందిన నాగరాజు ఈ నెల 7వ తేదీన ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బాలకృష్ణ, అరుణ్‌పై కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు



కరపత్రాలను అందజేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 9: వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్ రోడ్డు, సనత్ నగర్ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మారిపోయారని అన్నారు. టీడీపీని గెలిపిస్తే ప్రజలకు అమలు చేయనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో నరసింహులు నాయుడు, చంద్రమౌళి, మోహన్, శ్రీధర్, రమేష్, రత్నం, పులిమి శ్రీనివాసులు, రవీంద్రరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మట్టం శ్రావణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 9: మండలంలోని శిరసనంబేడులో సిద్ధేశ్వరస్వామి, రోసనూరులో భూపతేశ్వరస్వామి కొండల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అధికార పార్టీ నేతలు నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే ముసుగులో విచ్చలవిడిగా లేఅవుట్లు, మేనకూరు పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు గ్రావెల్ తరలిస్తున్నారు. అలాగే ఇసుక అక్రమంగా తరలించేస్తున్నారు. ముమ్మారెడ్డిగుంట నుంచి తాళ్వాయిపాడు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర స్వర్ణముఖినది తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఆయా ప్రాంతాల్లో నాణ్యమైన ఇసుక లభిస్తోంది. పెళ్లకూరులోని ఓ స్తంభాల తయారీ పరిశ్రమకు చిల్లకూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 9: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీడీపీవో దేవకుమారి అన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. సమీప ప్రాంతాల్లో ఎవరైన బాల్యవివాహాలు చేస్తుంటే 181, 100, 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, సీసీఆర్ సంయుక్త కార్యదర్శి గుత్తి త్యాగరాజు, ఉపాధ్యాయులు కవిత, చిన్నమ్మ, సరస్వతి, మహిళా కానిస్టేబుల్ ప్రసూన, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

వెండి కవచం తయారీకి విరాళం



విరాళం స్వీకరిస్తున్న చైర్మన్ కంఠా రమేష్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: అమ్మవారి వెండి కవచం తయారీ కోసం రైల్వే కోడూరు చెందిన చెందిన తోట రజనీకాంత్ దంపతులు రూ. 25వేల నగదు విరాళంగా అందజేశారు. పట్టణంలోని బహదూర్‌పేటలో వెలసిన నల్ల గంగమ్మ ఆలయంలో శుక్రవారం చైర్మన్ కంఠా రమేష్‌కు నగదు అందజేశారు. అనంతరం దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాటుచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అనిల్, యాదగిరి, నారాయణ, అర్చకులు గుణ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం: డీఎం

సత్యవేడు, ఫిబ్రవరి 9: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ప్రయాణికులకు సురక్షితమని సత్యవేడు ఆర్టీసీ డిపో డీఎం వెంటకరమణ తెలిపారు. శుక్రవారం డిపోలో డీఎం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా డిపో నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఆర్టీసీ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ రమణ, డీసీ వెంకటేశులు, సెక్యూరిటీ కానిస్టేబుల్ పవన్‌కుమార్, యూనియన్ నాయకులు చెంచులయ్య, గోవిందయ్య, గ్యారేజ్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీ భూహక్కుచట్టాన్ని రద్దు చేయాలి



పోస్టు కార్డుల ఉద్యమం చేస్తున్న టీడీపీ లీగల్ సెల్

రేణిగుంట,ఫిబ్రవరి9: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న భూహక్కుచట్టాన్ని వెంటనే రద్దు చేయాలని టీడీపీ లీగల్ సెల్ నాయకులు ఉదయ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. రేణిగుంట మండలం వెదళ్ళచెరువు గ్రామంలో శుక్రవారం ప్రజలు పోస్టుకార్డులతో ముఖ్యమంత్రికి లేఖలు పోస్టుచేశారు. ప్రభుత్వం వెంటనే నూతన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు వెంకటాద్రి యాదవ్, పండరి,మునెయ్య,ధర్మయ్య,మురళి,మదన్,యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

లారీని ఢీకొన్న బైక్: యువకుడి మృతి

తడ, ఫిబ్రవరి 9: ముందు వెళ్తున్న లారీని ఓ బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. తమిళనాడు గుమ్మిడిపూడి తాలూకా రాఘవరెడ్డి నేడు గ్రామానికి చెందిన ఎం.జ్యోడిస్(18) గురువారం అర్ధరాత్రి కొండూరులో ఉంటున్న తన బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. బోడిలింగాలపాడు మలుపువద్ద వేగంగా వెళలూ అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో జ్యోడిస్ అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 9: నాయుడుపేట - నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన సేతం సునీల్, యర్రాబత్తిన సునీల్ మోటారు సైకిల్‌పై శుక్రవారం నెల్లూరు వైపు వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోటలో ఏసీబీ అధికారుల విచారణ

కోట, ఫిబ్రవరి 9: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు ఒక కేసుకు సంబంధించి విచారణ చేపట్టారు. ఏసీబీ సబ్ ఇన్‌స్పెక్టర్, తహసీల్దారు నాగరాజరావు, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావు సమక్షంలో పలు రికార్డులను పరిశీలించారు. 2013లో కోటలో భూమి ఆక్రమణ విషయమై హైకోర్టులో కేసు నడుస్తోంది. ఆ భూమికి సంబంధించిన వివరాలను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులను పిలిపించి వివరాలను సేకరించారు. ఈ విచారణ అంతా గోప్యంగా జరిగింది.

నాటుబాంబు పేలి కుక్క మృతి

తడ, ఫిబ్రవరి 9: నాటుబాంబు పేలి కుక్క మృతి చెందింది. తడ కండ్రిగ పంచాయతీ అగ్రహారం వద్ద ఓ కుక్క చెట్లలో నుంచి ఓ చిన్నపాటి బాంబును నోటికి కరుచుకొని ఇళ్ల వద్దకు వచ్చింది. దానిని తినేందుకు ప్రయత్నించగా పేలిపోవడంతో కుక్క మృతి చెందింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అది బాంబు కాదని, టపాకాయ ఉండవచ్చని పోలీసులు చెప్పారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 9: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడుతామని ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఒక్కో క్లస్టర్ అధికారి 10నుంచి 13 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణలను పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎస్ఈబీ డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ ఓటర్లకు మద్యం పంపిణీ చేయడం వంటి ప్రలోభాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను సకాలంలో సరిష్కరించండి: కలెక్టర్



సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

తొట్టంబేడు, ఫిబ్రవరి 9: అర్జీదారుల సమస్యలను సకాలంలో సరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మండలంలోని పంక్షన్‌హాల్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సచివాలయ సిబ్బంది ప్రజలకు వివరించి వాటిని లబ్ధిదారులకునేరుగా అందెలా చూడాలన్నారు. సంక్షేమ పథకాల్లో సమస్యలున్నా 1902టోల్‌ఫ్రీ నెంబరుకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఎల్డీవో ఆదిశేషారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సన్నబియ్యం ఏదన్నా? - జనసేన



జనసేన నాయకులకు స్వాగతం పలుకుతున్న మద్దిలేడు గ్రామస్తులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 9: మాటతప్పని, మడమతిప్పని జగన్ ఇంటింటికి సన్న బియ్యం ఇస్తానని చెప్పి ప్రజలను మోసం చేశాడని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి కోట వినుత ఎద్దేవా చేశారు. శ్రీకాళహస్తి మండలంలోని మద్దిలేడు పంచాయతీలో జనసేన విజయ యాత్ర.. ఏపి నీడ్స్ పవన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమెల్యే మధుసూదన్‌రెడ్డి ఇంటి స్థలాలలో వేల కోట్లు సంపాదిదచారని, ప్రశ్నించిన టీడీపీ,జనసేన నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దండిరాఘయ్య, ఉపాధ్యక్షుడు శివకుమార్, పేట చిరంజీవి, లక్ష్మి, కవిత, శారద, రాజ్యలక్ష్మి, హెమంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు, ఫిబ్రవరి 9: 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గూడూరు పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు.

వెంకటగిరి: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్, శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరు వద్ద ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మర్మమతుల కారణంగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారంఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మనిరవి తెలిపారు.

చిల్లకూరు: మండలంలోని చిల్లకూరు, తిప్పగుంటపాళెం, అంకులపాటూరు, చింతవరం, వరగలి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఏఈఈ మునిశేఖర్ తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: పాశం



టీడీపీలో చేరినవారితో పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 9: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. అరాచకపాలన వల్ల అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. గాడి తప్పిన రాష్ట్రాభివృద్ధిని సరైన బాటలో నడిపించాలంటే చంద్రబాబునాయుడును సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, నాగేశ్వరరావు, పెంచలయ్య, రవీంద్రరెడ్డి, రఘురామయ్య, రమణయ్య, ప్రభాకర్‌రెడ్డి, రవి, అనంత్, రత్నయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మొలకలపూడిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

చిట్టమూరు, ఫిబ్రవరి 9: మండలంలోని మొలకలపూడి గ్రామంలో శుక్రవారం బాబు షూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి భవిష్యత్‌కు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెదనపర్తి రాజగోపాల్‌రెడ్డి, జనార్దనరెడ్డి, కాపులూరు చెంచురామయ్య ఆచారి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కల్లూరు మణి, గణపతి, వెంకటరమణయ్య, మురళీధర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలి: జనసేన

వెంకటగిరి, ఫిబ్రవరి 9: జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయమే తమకు శిరోధార్యమని, పార్టీ నిర్ణయానికి జనసైనికులు కట్టుబడి పనిచేయాలని ఆ పార్టీ నాయకుడు తోటా కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా ఎవ్వరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి విజయానికి జనసైనికులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల కొందరు జనసేన నేతలు వెంకటగిరి టికెట్ కేటాయింపులో కులసంఘాలకు మద్దతుగా పోరాటం సరికాదన్నారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకొన్నా క్రమశిక్షణా చర్యలకు గురవుతారని హెచ్చరించారు.

పురావస్తుశాఖ నుంచి కాపాడాలంటూ గిరిజనుల ధర్నా



నిరసన తెలుపుతున్న గిరిజనులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 9: మండలంలోని పాండూరు పంచాయతీలో ముట్టంగి తిప్ప గిరిజనులు, సుబ్బానాయుడుకండ్రిగ రైతులు చెన్నై పురావస్తు శాఖ వారి నుంచి తమను కాపాడాలని శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ 75 సంవత్సరాల క్రితం సంబంధిత భూములన్నీ చెన్నై పురావస్తుశాఖకు ఇచ్చారంటూ ఆ శాఖ అధికారులు ఈ ప్రాంతంలోని గిరిజనులు, రైతులపై రోజూ దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. గతంలో కూడా వారు జేసీబీలు, టిప్పర్లతో వచచ్చి గోతులు తీశారన్నారు. గిరిజనులు, రైతులు అడ్డుకుని కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించడంతో ఆర్డీవో ఇక్కడికి వచ్చి రికార్డులను పరిశీలించారన్నారు. ఈ భూముల్లో గిరిజనులకు నివాసపట్టాలు, బోర్లు, విద్యుత్ సౌకర్యం కూడా ఉందన్నారు. అంతే కాకుండా జగనన్నఇళ్లు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలలను ఇక్కడ నిర్మించారని గుర్తుచేశారు. కాగా గురువారం కూడాచెన్నై పురావస్తు శాఖ వారు మళ్లీ యంత్రాలతో వచ్చి గిరిజనులు, రైతులపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇళ్లపట్టాలు, పాఠశాలలు కట్టడానికి అనుమతించిన అధికారులు గిరిజనులు, పేదరైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తరుణ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు చంద్ర, తాండూరు ఎంపీటీసీ రమణమ్మ, చెన్నయ్య, ధనంజయులు, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



విశేషాలంకరణలో కనకదుర్గమ్మ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలం పై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవార తై అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం తై అమావాస్యను పురస్కరించకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించగా, దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

రేణిగుంట, ఫిబ్రవరి9: మండల పరిధిలోని 66 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ఏర్పాట్ల కోసం తహసీల్దారు నాగేశ్వర్‌రావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రేణిగుంటలోని జిల్లాపరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, ఆర్‌సిఎం హైస్కూలు, మండల పరిషత్ ప్రాథమిక, ఆదర్శపాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. ఫ్యాన్లు,లైట్లు,మరుగుదొడ్లు, తాగునీటి వసతులు, ఓటర్లు వచ్చి వెళ్ళడానికి తగిన భద్రత ఏర్పాట్లు పరిశీలించారు .లేని కేంద్రాల్లో పనులు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్‌బాబు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో ఉచిత రిజిస్ట్రేషన్

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 9: మండలంలోని సంతవేలూరు పంచాయతీ సచివాలయంలో జగనన్న కాలనీలో నిర్మించుకున్న 38మంది లబ్ధిదారులకు శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హబీబ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెలెక్ట్ మొబైల్‌షాప్ మేనేజర్‌పై కేసు



బాలకృష్ణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9: తిరుపతి సెలెక్ట్ మొబైల్‌షాప్ మేనేజర్ బాలకృష్ణపై కేసు నమోదైంది. కంపెనీకి చెందిన రూ.8.88 లక్షల మొత్తాన్ని కాజేసినందుకుగాను ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక తిలక్ రోడ్డులోని కృష్ణతులసి ప్యారడైజ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సెలెక్ట్ మొబైల్ షాప్ స్టోర్ మేనేజర్‌గా పి.బాలకృష్ణ పనిచేస్తున్నారు. ఇటీవల ఆడిట్ నిర్వహించగా లక్షల రూపాయల నగదుకు సంబంధించి లెక్క తేలలేదు. మేనేజర్‌ను ప్రశ్నించినా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. షోరూమ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అరుణ్‌తో కలిసి మేనేజర్ కంపెనీకి చెందిన రూ.8,88,530 సొంతానికి వాడుకున్నట్లు గుర్తించిన సెలెక్ట్ మొబైల్ షోరూమ్ అధికారి, హైదరాబాద్‌కు చెందిన నాగరాజు ఈనెల 7వ తేదీన ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బాలకృష్ణ, అరుణ్‌పై కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, ఫిబ్రవరి 9: నారాయణవనంలో వెలసిన కళ్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణతో ఊంజలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నేరం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 9: వెట్టిచాకిరీరికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ అధికారి హేమాచారి హెచ్చరించారు. శుక్రవారం పుత్తూరు మండల పరిధిలోని గొల్లపల్లిలో ఇటు కబట్టీ యజమానులు, కూలీలకు వెట్టిచాకిరీపై అవగాహన కలిగించారు. కూలీలతో వెట్టిచాకిరి చేయిండం, 18 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించడం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

కోలాహలంగా జల్లికట్టు

వడమాలపేట, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని బాలినాయుడు కండ్రిగలో శుక్రవారం జల్లికట్టు కోలాహలంగా జరిగింది. కోడెగిత్తల కొమ్ములకు ఉన్న పట్టీలను చేజిక్కించుకునేందుకు యువకులు పోటీపడ్డారు. కోడె గిత్తలను నిలువరించే ప్రయత్నంలో కొందరు యువకులకు స్వల్పగాయాలయ్యాయి. జల్లికట్టును ప్రత్యక్షంగా చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు.



పుత్తూరు వార్తలు

గుట్ట చదును చేస్తున్నా పట్టించుకోని అధికారులు

రెవెన్యూ సిబ్బంది తీరుపై స్థానికుల నిరసన

వడమాలపేట, ఫిబ్రవరి 9: మండలంలోని సీతారాపురం రెవెన్యూ పరిధిలో గుట్టపొరంబోకు భూములను ఆక్రమణదారులు చదును చేస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా గుట్ట పొరంబోకు భూమిని చదును చేస్తున్నారంటూ రెవెన్యూ అధికారులకు పలుమార్లు స్థానికులు నిరసన తెలిపారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో గురువారం కాలనీకి చెందిన మహిళలు సంఘటనా స్థలానికి వెళ్లారు. భూమిని చదును చేస్తున్న యంత్రాలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి పత్రికల్లో కథనం ప్రచురితం అయింది. అయినా కూడా పొరంబోకు భూములను ఎక్సవేటర్లు, ఇటాచీలతో చదును చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల సహకరిస్తుండడం వల్లే ఆక్రమణ దారులకు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భూఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గరుడవాహనంపై వీరరాఘువ స్వామి విహారం

నారాయణవనం, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలో నెలకొన కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం స్వామివారిని నిత్యపూజా కైంకర్యాలతో మేల్కొలిపి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రత్యేక పుష్పాలంకరణతో చేసి స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు. సాయంత్రం స్వామివారు గరుడవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పుత్తూరు అభివృద్ధి బాధ్యత నాది: భానుప్రకాష్



భానుప్రకాష్‌కు మంగళ హారతులిస్తున్న మహిళలు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 9: పుత్తూరు అభివృద్ధి బాధ్యత తనదేనని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు కృష్ణానగర్, లక్ష్మీనగర్‌లో మీతో మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని యూనిట్ ఇన్‌చార్జి మాధవనాయుడు, వార్డు అధ్యక్షుడు ఎస్ఆర్ఎంటీ మధు, బూత్ ఇన్‌చార్జి మునిప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గోపీ ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ విద్యాపరంగా, వ్యాపారపరంగా పంచాయతీ స్థాయిలో ఉన్న పుత్తూరు పట్టణంగా రూపాంతరం చెందడంతో ముద్దుకృష్ణమ కృషిని గుర్తుచేశారు. శాంతిభద్రతల విషయంలో ముద్దుకృష్ణమ నాయుడు కఠినంగా వ్యవహరించడంతోనే పుత్తూరు ప్రశాంత పట్టణంగా పేరు వచ్చిందని వివరించారు. వైసీపీకి రెండుసార్లు ఓట్లు వేయడం వల్ల పట్టణంలో ప్రైవేట్ సెటిల్‌మెంట్లు, కబ్జాలు, రౌడీమూకల అల్లర్లు నిత్యకృత్యమైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థ వైసీపీ నాయకుల కబంధహస్తాల్లో నలిగిపోతోందని మండిపడ్డారు. వీటన్నింటినీ అణచివేయాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతోనే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆరు పథకాలను ప్రకటించారని చెప్పారు. ప్రధానంగా మహిళా సాధికారకతకు దోహదం చేసేలా 18 ఏళ్లు నిండిన మహిళకు నెలకు రూ.1,500, ఏడాదికి మూడు గ్యాస్ సిండర్లు ఉచితం, చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితర పథకాలను వివరించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో 20 లక్షల ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా, ఎడ్యుకేషన్ హబ్‌గా మారేందుకు బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా అడుగడుగునా మహిళలు భానుప్రకాష్‌కు మంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీఎస్ గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్, ఎగ్ రమేష్, చెంచయ్య, కన్నా, రఫీ అహ్మద్, ఖాజాపీర్, కౌన్సిలర్ రాధా అశోక్, జీ.బాబు, కృష్ణమోహన్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం



వడమాలపేట, ఫిబ్రవరి 9: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా కమలనాధుని కల్యాణం జరిపారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని పట్టు పతాంబరాలు, పూలమాలలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యుల ఆధ్వర్యంలో గణపతి, అగ్నిహోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మేద మంత్రాలతో మంగళ్యధారణ చేయించారు. మహామంగళ హారుతులిచ్చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన మాధవరాజు భక్తులకు అన్నదానం చేశారు.



ఘనంగా అమ్మవారి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ వాసు రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రధాన విద్యుత్ కేంద్రంలో రెండో శనివారం పురస్కరించుకుని మరమ్మతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణం, గ్రామీణ, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ , ఏర్పేడు, కేవీబీ పురం మండలాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కలిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేణిగుంట: మండల పరిధిలో తూకివాకం,గాజులమండ్యం, ఎలమండ్యం,గురవరాజుపల్లి, కరకంబాడి, కుర్రకాల్వ ప్రాంతాల్లోని 33కేవి విద్యుత్ సబ్‌స్టేషన్స్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రేణిగుంట విద్యుత్ సబ్‌డివిజన్ డిఈఈ ప్రభాకర్ తెలిపారు. శనివారం ఉదయం8 నుంచి మధ్యాహ్నం2 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు.

వరదయ్యపాళెం: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సత్యవేడు: మండలంలో దాసుకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ రాజ్‌కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దాసుకుప్పం నుంచి పేరడం వరకు అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రేమించి మోసం చేశాడని ఫిర్యాదు

రేణిగుంట, ఫిబ్రవరి9: తనతో పాటు పనిచేస్తున్న పని చేస్తున్న ప్రితిరంజన్ మాన్‌సింగ్ అనే కార్మికుడు ప్రేమించి మోసం చేశాడని ఒడిస్సాకు చెందిన ఓ యువతి శుక్రవారం ఫిర్యాదు చేసినట్టు రేణిగుంట అర్బన్ పోలీసులు తెలిపారు. వివరాలిలా.. విమానాశ్రయం సమీపంలోవున్న ఓ కంపెనీలో ఒడిస్సాకు చెందిన యువతి,యువకుడు కొంతకాలంగా పని చేస్తున్నారని చెప్పారు. ఈక్రమంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిందన్నారు. దీంతో వారు వేణుగోపాలపురంలో కొద్దినెలలుగా కాపురం పెట్టారన్నారు.ఆ యువతి మాన్‌సింగ్‌ను వివాహం చేసుకోవాలని కోరడంతో అతను వదలి వెళ్లినట్టు ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బలిజ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



రంగా విగ్రహానికి నివాళులర్పించిన బలిజ సంఘం నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: శ్రీకాళహస్తి పట్టణ బలిజ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో భాగంగా స్వర్ణ మూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు హాజరయ్యారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గాజుల సత్యనారాయణ, అధ్యక్షుడిగా ఉప్పు కృష్ణయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు పూల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా నారాయణ, చిట్టివేలు జయగోపాల్ తదితర సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్త కమిటీ నాయకులను అంజూరు శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బలిజ యువత కమిటీలను కూడా ఎన్నుకుంటామని ప్రకటించారు. ఈనెల 12వ తేదీన అయ్యలనాడు చెరువులోని బలిజ సామాజిక వర్గానికి చెందిన స్థలంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

ఎస్టీయూ సమావేశాన్ని విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: ఈనెల 11న తిరుపతిలో జరిగే ఎస్‌టీయు జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేద్దామని శ్రీకాళహస్తి ఎంఈవో బాలయ్య పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌టీయు డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జనుమాల గురవయ్య, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ఏర్పేడు, ఫిబ్రవరి 9: వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం పాయల్‌సెంటర్ కుక్కలగుంటలో ఎన్నికలకు సిద్ధం ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, సర్పంచ్ మోహనప్రియ, నాయకులు పాల్గొన్నారు.

12మద్యం సీసాల స్వాధీనం: ఒకరి అరెస్టు

తొట్టంబేడు, ఫిబ్రవరి 9: మండలంలోని చిట్టత్తూరులో అక్రమంగా ఇంటి వద్ద మద్యం అమ్ముతున్న ఎల్లమ్మ38 పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాఘవేంద్ర కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇరుగుళం సీసీ రోడ్డుకు భూమిపూజ

సత్యవేడు, ఫిబ్రవరి 9: మండలంలోని ఇరుగుళం గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రూ.9 లక్షల తో రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఇన్‌చార్జి ఏఈ దేవిప్రసాద్, పంచాయతీ సెక్రటరీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జైత్రయాత్ర సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఈనెల 11వ తేదీన నిర్వహించబోయే వన్నెకుల క్షత్రియుల జైత్రయాత్ర మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. సభా స్థలిని శుక్రవారం ఆయన పరిశీలించారు. మహాసభకు మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీ భరత్ రెడ్డి హాజరవుతారని తెలిపారు.

తహసీల్దారు నాగేశ్వరరావుకు సత్కారం



రేణిగుంట,ఫిబ్రవరి9: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు నాగేశ్వరరావును శుక్రవారం ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్ అధ్వర్యంలో నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట పంచాయతీ వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం: ఆర్వో



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి నరసింహులు

సత్యవేడు, ఫిబ్రవరి 9: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు పాత్ర చాలా కీలకమని సత్యవేడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నరసింహులు పేర్కొన్నారు. సత్యవేడులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గ ఎన్నికల సెక్టార్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 279 పోలింగ్ కేంద్రాలుండగా, వాటిని 36 సెక్టార్ రూట్లుగా విభజించి ప్రతి రూట్‌కు ఒక అధికారిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి సెక్టార్ అధికారులు నడుచుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఆర్వో రామాంజనేయులు, సీఐ దివాకర్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

సిరుణంబుదూరులో 'ఆరోగ్య సురక్ష'

సత్యవేడు, ఫిబ్రవరి 9: మండలంలోని సిరుణంబుదూరు సచివాలయ పరిధిలో శుక్రవారం ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన వైద్య శిబిరంలో రోగులను దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యులు డా. మురళీకృష్ణ ఆధ్వర్యంలో తిరుపతి రుయా ఎముకల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ తదితరుల బృందం పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జానకి, వీఆర్వో మోహన్‌రాజ్, దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, సీహెచ్‌వో పవన్, ఫార్మాసిస్టు భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలి: అంబేడ్కర్ ఆర్మీ

సత్యవేడు, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంకు సంబంధించి ఎమ్మెల్యే టికెట్‌ను స్థానికులకే ఇవ్వాలని అంబేడ్కర్ ఆర్మీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉన్న విద్యావంతులు ఎందరో ఉన్నారని అలాంటి వారికి టికెట్ ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం ముగ్గురు దరఖాస్తు

సత్యవేడు, ఫిబ్రవరి 9: రానున్న ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలవాలని పలువురు ఆశిస్తున్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుని దరఖాస్తులు అందిస్తున్నారు. వీరిలో వరదయ్యపాళెం మండలానికి చెందిన ఎంటెక్ బాబు, సత్యవేడు మండలానికి చెందిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు చెల్లదురై, నాగలాపురం మండలానికి చెందిన సీనియర్ నాయకుడు ఏడీ శేషాద్రి ఉన్నారు.

ముక్కంటి ఆలయంలో వైభవంగా తై అమావాస్య



పూజలు చేస్తున్న అర్చకులు



భరద్వాజ తీర్థంలో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం తై అమావాస్య ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. అమావాస్యను పురస్కరించుకుని ముక్కంటి ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల శివనామస్మరణ నడుమ అలంకార మండపం నుంచి భరద్వాజ తీర్థం వరకు స్వామి అమ్మవార్ల ఊరేగింపు సాగింది. అక్కడ స్వామి అమ్మవార్లను కొలువు తీర్చారు. వేద పండితులు దేశకాల సంకీర్తతో కలశ స్థాపన చేసి సంకల్పం పూజలు జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష ద్రవ్యాలతో అభిషేకం, పుష్పాలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఆ తర్వాత నైవేద్య సమర్పణ చేసి, స్వామి అమ్మవార్లను ముక్కంటి ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మ గుడి వరకు ఊరేగించి కొలువు తీర్చారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు ఆలయం నుంచి వాహన మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి చతుర్మాడ వీధుల్లో స్వామి అమ్మవార్ల నగరోత్సవం జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన ఈ విశేష ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో యువత చేరిక



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: వైసీపీ నుంచి రేణిగుంటకు చెందిన 20 మంది యువకులు టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి స్వగృహం వద్ద శుక్రవారం వారంతా చేరారు.. ముందుగా రేణిగుంటకు చెందిన వైసీపీ కార్యకర్త సురేష్ యాదవ్ తన మిత్రులతో కలిసి సుధీర్ రెడ్డిని కలిసి సత్కరించారు. అనంతరం ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో జగదీష్, సురేంద్ర, మధు, సాయి, పురుషోత్తం, వెంకీ, రేవంత్, కిట్టు యాదవ్, చైతు, మురళి, నవీన్, వాసు, వంశీ, సాయి, జనార్దన్, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కన్నడ హీరో దర్శన్



దర్శన్‌కు స్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: ముక్కంటి ఆలయాన్ని శుక్రవారం కన్నడ సినిమా హీరో దర్శన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వెద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నదిలో శవమై తేలిన పారిశుధ్య కార్మికుడు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు - మృతుడు శీనయ్య (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: స్వర్ణముఖి నదిలో శీనయ్య(40) అనే పారిశుధ్య కార్మికుడు శవంగా తేలాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని రామసేతు వంతెన వద్ద శుక్రవారం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి పట్టణం సంతమైదానం ప్రాంతానికి చెందిన శీనయ్య, ఆయన భార్య పోలమ్మ మున్సిపాలిటీలో ఒప్పంద పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి సొంత పని నిమిత్తం బజారుకు వెళ్తున్నట్టు చెప్పి బయలుదేరిన శీనయ్య తర్వాత ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు అన్నిచోట్లా వెదికారు. ఇంతలో శుక్రవారం ఉదయం రామసేతు వంతెన వద్ద స్వర్ణముఖి నదిలో శవం తేలియాడుతున్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పారిశుధ్య కార్మికుడు శీనయ్యగా గుర్తించారు. పంచనామా అనంతరం మృతదేహానికి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు పాల్పడినట్లుగా స్థానికుల సమాచారంతో పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నియంత్రణ



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమని శ్రీకాళహస్తి ఆర్టీసీ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు చక్రవర్తి, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: 108 వాహనంలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వాహనంలో డ్రైవర్(పైలెట్), ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబరు 7032382246 సంప్రదించాలని కోరారు.

ఐఐటీలో పనులను త్వరితగతిన పూర్తి చేయండి: కలెక్టర్



ఐఐటీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఏర్పేడు, ఫిబ్రవరి 9: కేంద్ర విద్యాసంస్థ అయిన ఐఐటీలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం ఐఐటీకి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ లక్ష్మీశ, జేసీ శుభం బన్సల్‌తో కలిసి ప్లానింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డీన్ మురళీకృష్ణ, డిప్యూటీ రిజిస్టరు చమన్ మెహతా, ఈఈ చైతన్య, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులకు, ఆర్ అండ్‌బీ సంబంధించి కూడలి ఏర్పాటుకు డిజైన్ మేరకు చర్యలు చేపట్టాలని అలాగే ఐఐటీ వద్ద బస్ స్టాప్ ఏర్పాటుకు ఎన్‌హెచ్ త్వరితగతిన క్లియరెన్స్ ఇవ్వాలని, లెవల్ క్రాసింగ్ క్లోజర్‌పై క్లియరెన్స్‌కు సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు తాగునీరు అంశంపై ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ దృష్టి పెట్టి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాన్నారు. వీధిదీపాలకు సంబంధించి అంచనాలు తయారు చేయాలన్నారు. భూసంబంధిత సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు కృష్ణారెడ్డి, విజయకుమార్, ఐఐటీ ప్రతినిధులు, జి సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సభ విజయవంతంపై హర్షం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: శ్రీకాళహస్తి పట్టణంలో గురువారం జరిగిన జయహో బీసీ సభ విజయవంతం కావడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీసీ సభ విజయవంతం పై పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దశరథాచారి మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు నిర్వహించిన జయహో బీసీ సభ విజయవంతం కావడం సంతోషకరమన్నారు. వన్నెకుల క్షత్రియ సాధికార సమితి సభ్యులు మిన్నల్ రవి, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు, రేణుకాదేవి, డాక్టర్ ఉమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శన వీక్షిస్తున్న ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు

శ్రీకాళహస్తి, జనవరి 9: ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యా విజ్ఞాన ప్రదర్శన జరిగింది. పట్టణంలోని విజయవాడ హైస్కూల్ లో శుక్రవారం మూడు రోజులపాటు జరగబోయే విజ్ఞాన ప్రదర్శనను అసోసియేషన్ చైర్మన్ గొల్లపూడి మోహన్ రావు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సృజనాత్మక ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చెవిరెడ్డి మధుసూదన రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు జితేంద్ర, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తై అమావాస్య సందర్భంగా భక్తులకు అన్నదానం





అంకమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు - భరద్వాజతీర్థంలో అన్నదానం చేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: తై అమావాస్య పర్వదినం సందర్భంగా శుక్రవారం పలు ఆలయాల్లో దాతలు అన్నదానం నిర్వహించారు. ముక్కంటి ఆలయానికి అనుబంధమైన భరద్వాజ తీర్థంలో సత్యవ్రత భాస్కర క్షేత్ర అన్నదాన ట్రస్టు వ్యవస్థాపకులు గరికపాటి రామచంద్రయ్య పేరుమీద అతని తనయుడు రమేష్ బాబు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదానం ప్రారంభించారు. పట్టణం లోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా వెలసిన అంకాలమ్మ ఆలయం వద్ద మరాఠీ పాలెం వీధికి చెందిన భక్తులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, బాలాజీ, సత్యనారాయణ, జయ గణేష్, శివ కుమార్ రెడ్డి, క్రాంతి కుమార్, కృపానిధి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు అడ్డాగా రాజీవ్‌నగర్





రోడ్డు వరకు ఆక్రమించి నిర్మించిన ప్రహరీ - సుధీర్‌రెడ్డికి వివరిస్తున్న స్థానికులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 9: టీడీపీ అధికారంలోకి రాగానే రాజీవ్‌నగర్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధానరహదారి అనుకొని ఉన్న రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమాలపై శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌నగర్ కాలనీ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కారణంగా ఇక్కడ భూములు కోట్లలో పలుకుతుండడంతో జాగా కనిపిస్తే వైసీపీ నాయకులు గద్దల్లా వాలిపోయి కబ్జా చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసిన ఎమ్మెల్యే కబ్జాలకు ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు.. రాజీవ్‌నగర్ కాలనీ శ్రీకాళహస్తి,తొట్టంబేడు రెవెన్యూలో ఉన్నాయి. రాజీవ్‌నగర్‌లో మొత్తం చాలా వరకు ఎమెల్యే ప్రమేయంతోనే అక్రమాలు జరిగాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలన్నారు. లేని పక్షంలో తాము అధికారంలోకి రాగానే తొలగిస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, టీడీపీ నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.